క్లుప్తంగా

నేడు ఉరుకుందలో సమన్వయ కమిటీ సమావేశం

కౌతాళం: ఉరుకుంద ఈరన్నస్వామి శ్రావణ మాస ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి. వెంకటేశ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 5 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు నెల రోజుల పాటు జరిగే శ్రావణ మాస ఉత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సి పనులు, ఏర్పాట్లపై చర్చిస్తామన్నారు. డార్మెటరీ హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి



తిలక్, ఆజాద్‌ల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్వాతంత్య్ర సమరయోధులు బాల గంగాధర తిలక్, చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ నాగరాజు మాట్లాడుతూ హిందువుల ఐక్యతకై గణేష్ ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన ఆద్యుడు, తొలితరం భారత స్వాతంత్రోద్యమాన్ని నడిపించిన మహాయోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రశేఖర్ ఆజాద్‌లని చెప్పారు. బ్రిటీష్ పాలనను ధిక్కరించి, స్వాతంత్య్రం నా జన్మహక్కు అని నినదించాడన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు చెన్నబసప్ప, కార్యకర్తలు భీమేష్, అర్జున్, కాలురాం, వీరేష్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోనికి చేరిన తుంగభద్ర జలాలు



ఆదోని టౌన్: తుంగభద్ర జలాలు మంగళవారం ఆదోనికి చేరాయి. ఎల్లెల్సీ దిగువ కాలువలో తుంగభద్ర జలాశయం నుంచి విడుదలైన నీళ్లు ఆదోనికి చేరుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక తాగునీటి కొరత ఉండదని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు కెనాల్‌లో ప్రవహిస్తున్న నీటితో బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకును నింపుతున్నారు. వారం, పది రోజుల్లోగా బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకులో చేరుకున్న నీటిని సరఫరా చేస్తూ నీటి సమస్య లేకుండా చూస్తామని కమిషనర్ రామచంద్రారెడ్డి, ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకును 40 రోజుల్లోగా నింపుకుంటామని, అనంతరం రాంజల నల్లచెరువును నింపేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కుష్టు వ్యాధిపై అవగాహన



దుద్ది గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోసిగి: కుష్టు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌ఎన్ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్‌ఈఓ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండలంలోని దుద్ది గ్రామంలో ఎంఈఓ-2 నాగేశప్ప ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో హెల్త్ సిబ్బంది ర్యాలీ నిర్వహించి, కుష్టు వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రెండు అంతకంటే ఎక్కువగా రాగి రంగులో స్పర్శలేని మచ్చలు ఉంటే డాక్టర్లను సంప్రదించి పరీక్షలు చేయించుకుని మందులు వాడాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్స్ ఎల్లప్ప, రాముడు, హెల్త్ సిబ్బంది శ్రీనివాసులు, అమరిన్, రోహిత్ పాల్గొన్నారు.

29న మార్కెట్ వేలాలు

ఆదోని టౌన్: మున్సిపాలిటీకి ఆదాయ వనరులైన ఝాన్సీలక్ష్మీబాయి కూరగాయల మార్కెట్, పశువుల సంత, పశువులు, గొర్రెలు కమేళా తదితర మార్కెట్ల వేలాలు ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి మంగళవారం తెలిపారు. రెండుసార్లు వాయిదాపడిన మార్కెట్‌ల వేలాలను 29న తప్పకుండా నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుర్తుతెలియని సాధువు మృతి



ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో గుర్తు తెలియని సాధువు మృతి చెందాడు. కొన్ని రోజులుగా ప్రభుతాసుపత్రి ఆవరణలో ఉంటూ రోగుల కోసం వచ్చే బంధువులు పెట్టిన భోజనం తిని పడుకునేవాడు. సోమవారం రాత్రి మృతి చెందగా, మంగళవారం ఉదయం అక్కడే నిద్రిస్తున్న వారు గుర్తించి ఆసుపత్రి సిబ్బందికి సమాచారం అందించారు. పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందడంతో వారు వచ్చి విచారించగా.. వివరాలు ఏమి తెలియకపోవడంతో మున్సిపల్ అధికారుల సాయంతో అంత్యక్రియలు జరిపించారు.

డిజిటల్ పేమెంట్లవైపే మొగ్గు

- పెరుగుతున్న డిజిటల్ లావాదేవీలు
- పల్లె నుంచి పట్టణం దాకా ఆన్‌లైన్ పేమెంట్ బాట
- చిరువ్యాపారులు సైతం మొగ్గుచూపుతున్న వైనం
- భారీ తగ్గిన నగదు లావాదేవీలు



కిరాణాషాపు ముందు ఉంచిన ఫోన్‌పే డిజిటల్ పేమెంట్ క్యూఆర్ కోడ్

ఆదోని అర్బన్: జేబులో చిల్లిగవ్వ లేకపోయినా పర్వాలేదు. చేతిలో స్మార్ట్‌ఫోన్, బ్యాంకులో నగదు ఉంటే చాలు కావాల్సి వస్తువులు కొనవచ్చు, నచ్చిన ఫుడ్ తినవచ్చు. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్లు ఇప్పుడు వీధి వ్యాపార రంగంలోకి కూడా విస్తరించింది. చిరు వ్యాపారులు సైతం నగదురహిత లావాదేవీలకు అలవాడుపడ్డారు. ఎక్కడ చూసినా ఆన్‌లైన్ పేమెంట్స్ కనిపిస్తున్నాయి. కొబ్బరి బోండాలు, పానీపూరి, పండ్లు, కూరగాయలు, కిరాణాషాపుల్లో, చిల్లర కొట్టుల్లో ఇలా అన్ని చోట్ల డిజిటల్ పేమెంట్లు కొనసాగుతున్నాయి. పట్టణాల నుంచి మారుమూల పల్లెటూర్ల వరకు డిజిటల్ పేమెంట్లు కొనసాగుతున్నాయి. అలాగే ప్రభుత్వరంగ సంస్థ అయిన ఆర్టీసీ బస్సుల్లో కూడా ఆన్‌లైన్ డిజిటల్ పేమెంట్ సర్వీసును తీసుకొచ్చారు.

పరిస్థితికి అనుగుణంగా....

2016లో రూ.1000, రూ.500 నోట్ల రద్దుతో డిజిటల్ పేమెంట్లు మొదలయ్యాయి. అప్పట్లో ప్రజలు డిజిటల్ పేమెంట్లపై పెద్దగా ఆసక్తి చూపలేదు. పెద్దపెద్ద వ్యాపారసంస్థల్లో మాత్రమే డిజిటల్ లావాదేవీలు జరిగేవి. పట్టణంలో మాత్రం అంతోఇంతో ప్రాచుర్యం పొందినా.. గ్రామాల్లో డిజిటల్ పేమెంట్ల గురించి తెలియక భయపడేవారు. అయితే కరోనా కారణంగా నగదు లా వాదేవీలకు జనాలు భయపడ్డారు. అప్పటికే గూగుల్‌పే, ఫోన్‌పే, పేటీఎం ప్రాచుర్యం పొందడంతో చాలామంది నగదురహిత లావాదేవీలు చేసేందుకు మొగ్గుచూపారు.

చిరువ్యాపారులు సైతం....

ఆదోని నియోజకవర్గంలో 2.60 లక్షల జనాభా ఉన్నారు. ప్రతి ఇంటికి రెండు లేదా మూడు స్మార్ట్ ఫోన్‌లు వాడుతున్నారు. ఈ మేరకు దాదాపుగా 7.50 లక్షల సెల్‌ఫోన్‌లు వినియోగంలో ఉన్నాయి. టీస్టాళ్లు, కాకా హోటళ్లు, తోపుడుబండ్లు, రోడ్ల పక్కన ఫాస్ట్‌ఫుడ్స్, పండ్లు అమ్మేవారికి ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. చిల్లర సమస్యతో ఇబ్బందులు లేకుండా పోయాయని చిరువ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్లతో ఎలాంటి నష్టంలేదని చెబుతున్నారు. పేమెంట్ యాప్‌లకు సంబంధించి క్యూఆర్ కోడ్‌లను ఆయా సంస్థలు సులభంగా అందిస్తున్నాయి. ఏ దుకాణం వద్ద చూసినా పేమెంట్ క్యూఆర్ కోడ్‌లు దర్శనమిస్తున్నాయి.

స్పీకర్ బాక్సులతో మోసాలకు చెక్

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకు అవకాశం కూడా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరుకులు కొనుగోలు చేసిన తర్వాత వేరే ఖాతాకు నగదు బదిలీ చేసి, సెల్‌ఫోన్ స్క్రీన్‌పై సక్సెస్‌ఫుల్ పేమెంట్‌ను దుకాణదారుడికి చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు స్పీకర్ బాక్సులు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా డిజిటల్ మోసాలకు చెక్ పడుతోంది.

బ్యాంకుల్లో తగ్గిన నగదు లావాదేవీలు

బ్యాంకులో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలావరకు ప్రాధాన్యం తగ్గిపోయింది. క్యాష్‌లెస్ ట్రాన్స్‌క్షన్స్ చేస్తూ ప్రజలు ఇంటి వద్దనే అన్నిరకాల సేవలు పొందుతున్నారు. ఫలితంగా బ్యాంకులకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని చెబుతున్నారు. మరోవైపు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

ఫోన్ ద్వారానే నగదు చెల్లిస్తున్నా



గూగుల్‌పే, ఫోన్‌పే లాంటి ఆన్‌లైన్ యూపీఐ పేమెంట్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత వాటి ద్వారానే నగదు చెల్లించడానికి ప్రాధాన్యత పెరిగింది. హడావుడిలో బయటకు వెళ్లినప్పుడు డబ్బులు మరిచిపోయినా ఇబ్బందులు పడే పరిస్థితి ఇప్పుడు లేదు. ఫోన్ ద్వారానే డబ్బులు చెల్లిస్తున్నాను. ప్రతి షాపులోనూ యూపీఐ పేమెంట్లు అందుబాటులోకి రావడంతో అన్నిచోట్ల ఆన్‌లైన్ పేమెంట్లు చేస్తున్నా.

– సతీష్, ఆదోని

చిల్లర సమస్య లేదు



నగదు రహిత లావాదేవీలతో వ్యాపారం సులభం. నేను పట్టణంలో సెల్‌ఫోన్ కవర్లు, పౌచ్, స్క్రీగార్డ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాను. గతంలో చిల్లర సమస్య ఉండేది. ఇప్పుడు ఫోన్‌పే, గూగుల్‌పేతో చిల్లర సమస్యతో పాటు వ్యాపారం సులువుగా మారింది. ఎక్కువగా డిజిటల్ ద్వారానే చెల్లింపులు చేస్తున్నారు.

– లింగప్ప, దుకాణదారుడు

కౌలు కార్డుతో ప్రయోజనం



రైతుకు కౌలు కార్డు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి

గోనెగండ్ల : పంట సాగు హక్కు పత్రాల (కౌలు కార్డులు)తో కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా వ్యవసాయ అధికారిణి వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలతలతో కలిసి మండలంలోని తిప్పనూరు గ్రామంలో కొర్ర, పత్తి, కంది పంటలను పరిశీలించారు. అనంతరం రైతులకు కౌలు హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా కౌలు కార్డులు తీసుకోవాలన్నారు. కౌలు కార్డు అనేది భూ యజమానికి, సాగుదారులకు మధ్య ఒప్పంద పత్రం అన్నారు. భూమి యజమాని తమ పొలాలను కౌలు దారులకు ఇచ్చునప్పుడు కౌలు పత్రానికి 11 నెలలు మాత్రమే విలువ ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే పంట సాగు హక్కు పత్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే కొర్ర రకం ఎస్ఐఏ రకం 90 నుంచి 95 రోజులలో దిగుబడి వస్తుందని, అతి తక్కువ ఖర్చుతో పంట దిగుబడి పొందవచ్చునని తెలిపారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగు నివారణకు జిగురు అట్టలు ఎకరానికి 30 అమర్చుకోవాలని సూచించారు. మొదటి విడతలో వేపనూనె పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది అబ్దుల్ సత్తార్, జాకీర్, రైతులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి

ఆదోని అర్బన్/ఆదోని అర్బన్: ఇంటింటి కుళాయి (జలజీవన్ మిషన్) పథకం కింద ఆదోని అసెంబ్లీ పరిధిలోని గ్రామాల్లో శుద్ధమైన తాగునీటి సరఫరా కోసం రూ.77 కోట్లు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌ను ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. మంగళవారం అసెంబ్లీ సెషన్స్ విరామ సమయంలో పవన్‌కళ్యాణ్‌ను కలిసి ఇంటింటి కుళాయి పథకానికి సంబంధించిన నివేదికను సమర్పించారు. అలాగే ఆదోని శివారు కొండలో ఉన్న రణమండల పరిసర ప్రాంతాలను పర్యాటక కేంద్రంగా గుర్తించి అభివృద్ధి చేయాలని టూరిజం మరియు సాంస్కృతికశాఖ మంత్రి దుర్గేష్‌ను కలిసి కోరారు. క్షేత్ర పరిసర ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన నివేదికను సమర్పించి రూ.50 కోట్లు కేటాయించాలని కోరారు.

సీనియర్ న్యాయవాది మృతి



టి.నాగరాజు(ఫైల్)

ఆదోని రూరల్: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది టి.నాగరాజు మంగళవారం రాత్రి మృతిచెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల సీనియర్ న్యాయవాదులు మన్సూర్‌అహ్మద్, వై.ఆర్.మల్లికార్జున, దేశాయ్, బద్రినాథ్, అనితాబాయ్ సంతాపం తెలిపారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గుండమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ శివనారాయణస్వామి హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, పంప్ హౌస్, చెరువు, గ్రామంలోని తాగునీటి ట్యాంకులను , గ్రామంలో మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా ఆయన ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అలాగే తరగతి గదిలో విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షించారు. పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పిల్లల భోజనంలో నాణ్యతను పెంచి మంచి పౌష్టికాహారాన్ని అందజేయాలన్నారు.

శానిటేషన్‌పై ఆగ్రహం

నాగనాథనహళ్లి గ్రామంలో శానిటేషన్‌పై సబ్‌కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామంలో పేరుకుపోయిన మురుగు కాల్వల చెత్తను చూసి పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ ప్రజలతో ప్రభుత్వం అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పంప్‌హౌస్, చెరువు తాగునీటి పరీక్షలను తనిఖీ చేశారు. ప్రతిరోజూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు గ్రామాల్లో తాగునీటికి సంబంధించిన పరీక్షలను ఎప్పటికప్పుడు నిర్వహించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

గుండమ్మ కుటుంబానికి పరామర్శ

శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో ఇటీవల హత్యకు గురైన గుండమ్మ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. డీఎస్పీ శివనారాయణస్వామి పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ

ఆదోని పౌరసరఫరా గోదాము పాయింట్‌ను మంగళవారం సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ తనిఖీ చేశారు. గోదాములో నిల్వ ఉన్న రేషన్ నిల్వ, రికార్డ్స్, భద్రత తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఉప తహసీల్దార్ వలి బాషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాసీం పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ప్రత్యేక హోదా ఊసేలేదు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రప్రభుత్వం మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశం లేకపోవడం శోచనీయమని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక హోదా సంజీవని లాంటిదని, ఐదు సంవత్సరాలు కాదు పది సంవత్సరాల పాటు ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతిలో స్వయాన ప్రధాని నరేంద్రమోదీ నాడు హామీ ఇచ్చారన్నారు. నేడు ప్రత్యేక హోదాను మరిచారని చెప్పారు. ప్రత్యేక హోదా సాధనకు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సైతం కృషి చేయలేదని విమర్శించారు. అదేవిధంగా విద్యారంగానికి, నిరుద్యోగ యువతకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వలేదని చెప్పారు. కడప స్టీల్‌ప్లాంట్, రైల్వే జోన్ల ఊసే లేకపోవడం రాష్ట్రాభివృద్ధికి విఘాతం కలిగినట్లేనన్నారు.

ఉద్యోగులను నిరాశపరిచిన బడ్జెట్

ఆదోని సెంట్రల్: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులను నిరాశపరిచిందని ఎస్టీయూ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ వీరచంద్ర యాదవ్ అన్నారు. పాత పన్నుల విధానంలో ఎలాంటి మార్పులు చేయకుండా కొత్త పన్నుల చెల్లింపులో కొన్ని మార్పులు చేసినప్పటికీ ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సీపీఎస్ విధానంలో మార్పులు చేస్తామని చెప్పి పాత పెన్షన్ విధానంపై స్పష్టత ఇవ్వకపోవడంపై ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశకలిగించిందని తెలిపారు. పన్నుల చెల్లింపులో పాత విధానం కన్నా కొత్త విధానంలో ఎక్కువగా చెల్లించాల్సి వస్తోందన్నారు. విద్యారంగానికి 6 శాతం బడ్జెట్ కేటాయించాల్సి ఉండగా కేవలం 3.25 శాతం నిధులను కేటాయించడం సరికాదన్నారు. ప్రభుత్వం ప్రకటించిన స్టాండర్డ్ డిడెక్షన్‌ను రూ. లక్ష వరకు పెంచాలన్నారు.

డిగ్రీ కళాశాలను ఉన్నచోటనే కొనసాగించాలి

ఆదోని రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రస్తుతం ఉన్నచోటనే కొనసాగించాలని, ఆరేకల్‌కు తరలించడం సరైన పద్ధతి కాదని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ అధికారికి వినతి పత్రం అందించారు. విద్యార్థి సంఘం నాయకులు ఎస్.షాబీర్‌బాషా, బసాపురం లింగప్ప మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి విద్యార్థి సంఘాలు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత సంవత్సరం పట్టణంలోని వైఎంకే స్కూల్‌లో తరగతులు ప్రారంభించారని చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యాక బిల్డింగ్ రెంట్ కట్టలేక కాలేజీని ఆరేకల్‌లో ఉన్న ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ కళాశాలకు మారుస్తామని చెప్పడం సరైనది కాదన్నారు.


26న వాహనాల వేలం

ఆదోని రూరల్: ఆదోని స్పెసల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 26న స్థానిక సెబ్ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ విన్నీలత తెలిపారు. ఆసక్తి గల వారు 9440902578 నంబర్‌ను, లేదా స్థానిక సెబ్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.

వేలం పాట వాయిదా

కోసిగి: మండల కేంద్రం కోసిగి సమీపంలోని పులికనుమ రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి ఏర్పాటు చేసిన బహిరంగ వేలం పాట వాయిదా వేస్తున్నట్లు మత్స్యశాఖ డివిజనల్ అధికారి నాగరాజు ప్రకటించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో పులికనుమ రిజర్వాయర్‌లో 01-07-2024 నుంచి 30-06-2025 వరకు చేపల పెంపకానికి వేలం పాట మొదలు పెట్టారు. అయితే టీడీపీ మండల నాయకులు జోక్యం చేసుకుని ప్రస్తుతం మా టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉందని మా పార్టీ వాళ్లకే కేటాయించాలంటూ డిమాండ్ చేశారు. వేలం వాయిదా వేయాలని మధ్యలో బయటకు వెళ్లిపోయారు. దీంతో మత్స్యశాఖ డివిసల్ అధికారి నాగరాజు జిల్లా మత్స్య శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వేలం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో వేలం నిర్వహించే తేదీ ప్రకటిస్తామన్నారు. ఎస్ఐ సతీష్ కుమార్, ఆర్ఐ శ్రీరాములు, మత్స్యశాఖ అసిస్టెంట్ చంద్రకళ, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి



బ్రిడ్జిని పరిశీలిస్తున్న కౌన్సిలర్, వార్డు ప్రజలు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.40లక్షలతో పట్టణంలోని 16వ వార్డులోని వంకపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదంతో బ్రిడ్జి నిర్మాణానికి రూ.40లక్షలు మంజూరు చేశారు. దీంతో బాక్స్ కల్వర్ట్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. నిర్మాణం పూర్తయిన బ్రిడ్జిని మంగళవారం ఆవార్డు కౌన్సిలర్ వాహిద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణం ప్రస్తుతం పూర్తయిందని బ్రిడ్జికి అనుసంధానం చేస్తూ రూ.24లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిఉందన్నారు. రోడ్డు పనులు ప్రారంభించే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయాయని చెప్పారు. ఎన్నో దశాబ్దాలుగా వంకపై బ్రిడ్జిలేక ఇబ్బందులు పడుతున్న వార్డు ప్రజల చిరకాల సమస్య పరిష్కరించిన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈలు, ఏఈలకు వార్డు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ తీగ చోరీ

నందవరం : మండల పరిధిలోని నదికైరవాడి గ్రామ సమీపంలోని ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్ చోరీ గురైన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మంత్రాలయం- నదికైరవాడి మధ్యలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ వైరును చోరీ చేశారు. మంగళవారం నదికైరవాడి, ఇబ్రహీంపురం గ్రామ రైతులు ఎత్తిపోతల పథకం వద్దకు వెళ్లి చూడగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసమై చిందరవందరగా పడి ఉండటం గమనించారు. వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాదాపుగా రూ.50 వేలు నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎస్ఐ తిమ్మయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని తుంగభద్ర రైల్వే స్టేషన్ సమీపంలో ఇద్దరు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ భార్గవరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుంగభద్ర రైల్వే స్టేషన్ సమీపంలో బోయ నాగరాజు, బోయ బసవరాజు అనే ఇద్దరు వ్యక్తులు మట్కా చీటీలు రాస్తుండగా వారిని పట్టుకున్నట్లు చెప్పారు. ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.6,280లు నగదును స్వాధీనం చేసుకొని మాధవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

ఎల్లెల్సీలో వ్యర్థాల తొలగింపు

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)లో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తాచెదారం తొలగింపు పనులను మంగళవారం మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. కాలువకు నీటిని విడుదల చేస్తున్నందున నీరు కలుషితం కాకుండా వుండేందుకు వ్యర్థపదార్థాలను యంత్రాలతో తొలగిస్తున్నారు. ఆయా పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలువకు వచ్చే నీరు మంచినీటి అవసరాలకు ఉపయోగించనున్నందున పట్టణ ప్రజలు ఇకపై చెత్తాచెదారాన్ని, పూజా సామగ్రిని కాలువాలో వేయొద్దని సూచించారు. కార్యక్రమంలో టీపీఓ గోపాలకృష్ణ, డీఈ నీరజ, పట్టణ సర్వేయర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్లను నింపాలి

కోసిగి: మండలంలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్టులు, పులికనుమ రిజర్వాయర్లకు తుంగభద్ర నది నుంచి నీటిని పంపింగ్ చేసి నింపాలని కోసిగి మేజర్ గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ కోరారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ హొస్పేట్ డ్యామ్ నుంచి తుంగభద్ర నదికి నీటిని విడుదల చేశారన్నారు. గురురాఘవేంద్ర ప్రాజెక్ట్ అధికారులు స్పందించి పంప్‌హౌస్‌ల ద్వారా పంపింగ్ ప్రారంభించాలని కోరారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకోండి



మాట్లాడుతున్న ఎస్ఈ ఉమాపతి

ఆదోని అర్బన్: పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కటే ఉంటే అదనంగా మరొకటి ఏర్పాటు చేసుకొని లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి సూచించారు. మంగళవారం స్థానిక డీఈ కార్యాలయంలో విద్యుత్‌శాఖ అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఎస్ఈ మాట్లాడుతూ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ఎక్కువ లోడు పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. డ్యామేజ్ పోల్స్ ఏవైనా ఉంటే వెంటనే మార్చుకోవాలన్నారు. ఇంప్రూమెంట్ లైన్‌లు వేసుకునేందుకు ప్రపోజల్ పెట్టుకొని వచ్చిన వెంటనే లైన్‌లు వేసుకోవాలని సూచించారు. అడిషనల్ లైన్‌లు వేసుకోవాలన్నారు. రైతులకు వ్యవసాయంపై విద్యుత్ కనెక్షన్లకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదు వస్తే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ డీఈ రాజేష్, ఏడీఈ పురుషోత్తం, ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా ఎదగడానికే 'శిక్షా సప్తాహ్'



విద్యార్థులు తయారు చేసిన బోధన ఉపకరణలు

కౌతాళం: ప్రతి పిల్లవాడు ఉత్తమ విద్యార్థిగా ఎదగడానికి శిక్షా సప్తాహ్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని కౌతాళం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఇమ్మాన్యుయల్ అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు తయారు చేసిన భోదన ఉపకరణల ప్రదర్శన చేపట్టారు. న్యూమరసీ, లీటరసీ కార్యక్రమంలో వంద మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారు తయారు చేసిన ఉపకరణల ప్రదర్శించినట్లు తెలిపారు.

హాస్టల్‌ను ఏర్పాటు చేయండి

కౌతాళం: మండలంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజా, కృష్ణ కోరారు. తహసీల్దార్ అలెగ్జాండర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. రాకేష్, తిమ్మరాజు, అశోక్, నవీన్, విజయ్ పాల్గొన్నారు.

ఏపీ గురుకుల కాలేజీ తనిఖీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీ, ఏపీ గురుకుల పాఠశాలలను మంగళవారం తహసీల్దార్ శేషారెడ్డి, ఎంఈవో-2 మధుసూదన్‌రాజు తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదోని అర్బన్: రాంజల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త 33కేవీ లైన్‌లో పనుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.



ఆలయం ముందు కిక్కిరిసిన భక్తులు



చెట్లకింద పిండివంటలు ఆరగిస్తున్న భక్తులు

ఘనంగా ఎల్లమ్మవ్వ గంప జాతర



రేణుకాఎల్లమ్మవ్వకు మంగళహారతి ఇస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: ఆషాఢమాసం మూడో మంగళవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ అవ్వ గంపజాతర ఘనంగా జరిగింది. ఆలయ నిర్వాహకులు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూల అలంకరణ, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు ముందుగానే వచ్చి మండపాల్లో బసచేశారు. అమ్మవారి పిండి వంటకాలు తయారు చేసి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఆదోని, చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు ఇంటి నుంచి పిండి వంటలు చేసుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ సమీపంలో బొమ్మల అంగళ్లు కిటకిటలాడాయి. డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ట్రాఫిక్‌కు అంతరాయం, భక్తుల తోపులాట లాంటి ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించారు.